మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో మాట్లాడుతున్న నాయకులు

కౌలు రైతుకు దక్కని గుర్తింపు

◆ అవగాహన కార్యక్రమాలతో సరి
◆ కార్డుల మంజూరులో ఇప్పటికీ లక్ష్యంలో 12 .4 శాతమే మంజూరు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కౌలు రైతు గుర్తింపునకు నోచుకోవడం లేదు. కౌలు రైతులను గుర్తించి కార్డులు మంజూరు చేసే ప్రక్రియ నామ మాత్రంగా నడుస్తోంది. అధికారులు అవగాహన కార్యక్రమాలతోనే సరిపెడుతున్నారు. అనంతపురం జిల్లాలో సుమారు ఒకటిన్నర లక్షల మందికిపైగా కౌలు రైతులున్నారు. వీరందరూ ప్రకృతి వైపరీత్యాల నడుమ ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పంటలు సాగు చేస్తున్నారు. ఏదైనా పంట నష్టం సంభవిస్తే పరిహారం అందివ్వాలంటే ప్రధానంగా కౌలు రైతుకు గుర్తింపు కార్డు ఉండాల్సి ఉంటుంది. దీన్నే సిసిఆర్‌సి (క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డు) అంటారు. ఇది ఉంటేనే రైతుకు ప్రభుత్వం ద్వారా ఏదైనా సహాయం అందుకునే వీలుంటుంది. పంట అమ్ముకోవాలన్న ఈ కార్డును చూపించాల్సి ఉంటుంది. ఇంతటి కీలకమైన ఈ కార్డును రైతులకు అందజేసే ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఇప్పటికే వర్షాభావంతో రైతులు నష్టపోయే పరిస్థితి కూడా నెలకొంది. ఈ నష్టానికి సంబంధించి పరిహారం రావాలన్న ఈ కార్డు ఉంటేనే సాధ్యమవుతుంది.

లక్ష్యంలో 12.4 శాతమే పంపిణీ

అనంతపురం జిల్లాలో ఒకనటిన్నర లక్షల మంది కౌలు రైతులుంటారన్నది అంచనా. అయితే ఇందులో ఈ ఏడాది 8330 మంది రైతులకు సిసిఆర్‌సి కార్డులు అందజేయాలన్నది వ్యవసాయ శాఖ ముందున్న లక్ష్యం. అది కూడా పూర్తవలేదు. ఇప్పటి వరకు 31 మండలాల్లో కలిపి 1048 మందికి మాత్రమే సిసిఆర్‌ఎస్ కార్డుల మంజూరుకు సిద్ధమయ్యారు. కొన్ని మండలాల్లో అయితే ఇద్దరిని మాత్రమే సిసిఆర్‌సి కార్డులకు అర్హులుగా గుర్తించడం గమనార్హం. జిల్లాలోనే అత్యధికంగా కౌలు రైతులుండే కణేకల్ మండలంలో ఇద్దరికి మాత్రమే సిసిఆర్‌సి కార్డులు మంజూరుకు అర్హులని గుర్తించారు. ఈ మండలంలో 370 మంది రైతులకు కార్డులు మంజూరు చేయాలన్నది లక్ష్యం. ఇక కల్యాణదుర్గంలో ఇద్దరే అర్హులను గుర్తించారు. ఇలా మొత్తంగా సిసిఆర్‌సి పంపిణీ నత్తనడకన సాగుతోంది.

సిసిఆర్‌సి కార్డులు అందజేయాలి

అనంతపురం జిల్లాలో అత్యధికంగా కౌలు రైతులున్నారు. ఉరవకొండ ప్రాంతంలోనూ, రాయదుర్గం ప్రాంతంలోనూ కౌలు రైతులు అధికంగానున్నారు. కొన్ని చోట్ల దేవాదాయ భూములు కౌలుకు చేస్తున్న రైతులూ ఉన్నారు. అటువంటి వారికి కూడా సిసిఆర్‌సిల్లేవు. ఇప్పటికైనా అధికారులు వీటిపై దృష్టి సారించి కార్డులు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలి. లేకపోతే పంటనష్టపోతే వారికి ఎటువంటి సాయం అందే పరిస్థితి ఉండదు.

బాలరంగయ్య,
ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

అంగన్వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిని అరెస్టు చేయాలి

అధికారుల తీరుకు నిరసగా నేడు ఆందోళన
సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఓబుళదేవరచెరువు మండలంలో వీరప్పగారిపల్లి మినీ అంగన్వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి. ఓబులు డిమాండ్ చేశారు. స్థానికి సిపిఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మినీ అంగన్వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నానికి కారకులైన తెలుగుదేశం నాయకుడు ఆంజనేయులును వెంటనే అరెస్టు చేసి బాధితురాలికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నానికి సంబందించిన విషయంపై మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చర్చల పేరుతో సిపిఎం నాయకులను తన ఆఫీసుకు పిలిపించి అవమానించారని ఆగ్రహం వ్యక్త చేశారు. నిందితుడు ఆంజనేయులు మాజీ మంత్రి ఎదుటే సిపిఎం నాయకులను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నన్ను కాదు, మొదట సిఐటియు నాయకులను అరెస్టు చేయాలి' అని అనుచితంగా మాట్లాడాడని అన్నారు. పల్లె రఘునాథ్ రెడ్డి ముందే నిందితుడు ఇలా మాట్లాడడం బాధాకరమన్నారు. ఈ అవమానంతో చర్చలను వదిలేసి బయటికి వచ్చామన్నారు. అంగన్వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఆంజనేయులు అరెస్టు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో బుధవారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఓడిసి ప్రాజెక్టు వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపడతామన్నారు. మిగిలిన 11 ప్రాజెక్టుల పరిధిలో తహశీల్దార్, సిడిపిఒలకు వినతి పత్రాలు అందజేసే కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. శ్రీ సత్య సాయి జిల్లాలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలను, ఆయాలను అనేక ప్రాంతాలలో రాజకీయ నాయకులు వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆగస్టు రెండో తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని తెలియజేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి. శ్రీదేవి, కోశాధికారి సిఎస్ శ్రీదేవి, ఒడిసి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఆశీర్వాదమ్మ, కార్యదర్శి రంగమ్మ, మణిమాల, కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

పకడ్బందీగా సిఎం పర్యటన ఏర్పాట్లు

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి - మడకశిర

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆగస్టు 1వ తేదీన నియోజకవర్గ పరిధిలోని గుండుమల పంచాయతీలో నిర్వహిస్తున్న పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటిస్తున్న గుండుమల గ్రామాన్ని మంత్రి మంగళవారం సందర్శించారు. హెలిపాడ్, పెన్షన్ పంపిణీ, సిఎం పాల్గొనే కార్యక్రమాలపై స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుతో కలసి అధికారులతో చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 1 తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం పాల్గొని అనంతరం గ్రామస్తులతో ముఖాముఖి కార్యక్రమాలలో పాల్గొంటారన్నారు. గ్రామ సమస్యలు పరిష్కరించడానికి ప్రజా వేదిక నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాత్ర ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, డాక్టర్ సెల్ అధ్యక్షులు కొంకల్లు కృష్ణమూర్తి, జిల్లా కలెక్టర్ టిఎస్. చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా ఎస్పీ రత్న, ఆర్డీవో భాగ్యరేఖ, స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ గుండుమల జయప్ప, గుండుమల సర్పంచి కరియన్న, మాజీ సర్పంచి గుండుమల చంద్రప్ప, స్థానిక తహశీల్దార్ వెంకటేష్, టిడిపి మండల కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, గణేష్, మదన కొండప్ప కుమారస్వామి, దాసిరెడ్డి, నియోజకవర్గ టిడిపి నాయకులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి

పారిశ్రామికవేత్తలతో మంత్రి సవిత

పారిశ్రామిక వేత్తలతో మంత్రి సవిత

ప్రజాశక్తి - పెనుకొండ

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులకు, అభిబృద్ధి ప్రాజెక్టులు చేపట్టేందుకు టిడిపి ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. ఈ మేరకు ఆమె బెంగుళూరులోని తాజ్ హోటల్‌లో పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన టెక్సపోర్ట్ ఓవర్సీస్ ప్రవేట్ లిమిటెడ్, ఇండియన్ డిజైన్స్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, టెక్సపోర్ట్ సిండికేట్ లిమిటెడ్ ,కాటన్ వరల్డ్, టెక్సపోర్ట్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, సిల్వర్ స్పార్క్ అప్పారెల్, అరవింద్ లిమిటెడ్, షాహి ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్, డెనిమ్ ఇండియా, ఆదిత్య బిర్లా రిటైల్ ఫ్యాషన్స్, సేవ్ ఎర్త్ ప్రైవేట్ లిమిటెడ్,ప్రోస్కిల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టెక్స్ టైల్,, గార్మెంట్స్ తదితర పారిశ్రామిక వేత్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులకు, అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టేందుకు ఉన్న అవకాశాలు వివరించారు. రాష్ట్రంలో రాజకీయ స్థిరత్వంతో కూడిన ప్రభుత్వ పాలన ఉందని, పెట్టుబడులను ప్రోత్సహించే సానుకూల దృక్పథం తమ ప్రభుత్వం ఉందని మంత్రి వివరించారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునే నైపుణ్యం కలిగిన యువత రాష్ట్రంలో ఉందని వారి ప్రతిభకు తగిన అవకాశాలు కల్పించడానికి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను మంత్రి కోరారు.

నవ సమాజ నిర్మాణంలో మహిళలు భాగస్వాములు కావాలి

అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

నవ సమాజ నిర్మాణంలో మహిళలు భాగస్వాములు కావాలని అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ పిలుపు నిచ్చారు. చట్టాలపై అవగాహన పెంచుకుంటూ సమాజ నిర్మాణానికి సహకరించాలన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మానవ అక్రమ రవాణాపై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన న్యాయమూర్తి శైలజ మాట్లాడుతూ గతంలో మహిళల అక్రమ రవాణా ఉండేదని ప్రస్తుతం అది మానవ రవాణాగా మారిందని అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయమూర్తి కంపల్లె శైలజ

భారతదేశంలో ప్రతి నిమిషానికి ఒక అదృశ్యం కేసు నమోదు అవుతోందనిఆందోళన వ్యక్తం చేశారు. ఎవరి కుటుంబానికి వారే రక్షణగా ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మహిళలు, బాలికల అక్రమ రవాణాలో అత్యధికంగా మహిళలే సూత్రధారులుగా ఉండటం జరుగుతోందన్నారు. గతంలో జంతు, పక్షులపై వైద్య పరిశోధనలు జరిపి ఆ తర్వాత మానవులపై సంబంధిత మందుల ప్రభావం పై శాస్త్రవేత్తలు బేరీజు వేసేవారని, తాజాగా నేరుగా మానవులపైనే శాస్త్ర పరిశోధనలు చేస్తుండంవల్ల మానవ అక్రమ రవాణాకు అడ్డూ, అదుపు లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అపరిచిత వ్యక్తులు చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దని మహిళలకు సూచించారు. మనిషి తన ఆలోచన విధానాల్లో మార్పు వచ్చినప్పుడే సమాజం పట్ల బాధ్యత ఉంటుందని శైలజ చెప్పారు. ఆసియా దేశాల్లో భారతదేశం నుండే అత్యధికంగా మానవ రవాణా జరుగుతుండడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, ప్రభుత్వం న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ న్యాయవాది సుదర్శన్ మహిళా చట్టాలు, తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విశ్వనాథ్, న్యాయవాదులు గోపాలకృష్ణ, అంజనమ్మ, టౌన్ ప్రాజెక్టు మేనేజర్ హరినాథ్ రెడ్డి, లోక్ అదాలత్ సిబ్బంది శారద, మెప్మా రిసోర్స్ పర్సన్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

అవినీతి సొమ్మును రికవరీ చేయాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

సామాజిక తనిఖీలో తేల్చిన అవినీతి సొమ్మును రికవరీ చేసి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, చేనేత, కెవిపిఎస్, మండల కమిటీల ఆధ్వర్యంలో మండల కార్యదర్శి రంగప్ప అధ్యక్షతన స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టడం జరిగింది. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సామాజిక తనిఖీ బృందం విచారణ చేసి రూ. 33.62 లక్షల అవినీతి, అక్రమాలను తేల్చడంతో పాటు రికవరీ రూ. 2.49 లక్షలు, విచారణకు రూ. 3.51 లక్షలు, జరిమానా రూ. 10 వేలుగా తుది నివేదిక లో పేర్కొన్నారన్నారు. నివేదిక ఇచ్చి వారమైనా రికవరీ గానీ, చర్యలు గాని ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, మండల కార్యదర్శి వెంకటేషులు, గోవిందప్ప, వెంకటేశులు, కల్లు గీత కార్మిక సంఘం నాయకులు కిష్టప్ప, ఈడిగ నాగరాజు, ఆవాజ్ మండల అధ్యక్షుడు మాబు, నజీర్, షబ్బీర్, వ్యకాసం నాయకులు బెస్త కిష్టప్ప, సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ, రవి, చేనేత కార్మిక సంఘం నాయకులు కుమ్మర కిష్టప్ప, రామాంజనేయులు, జింకా నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-నల్లమాడ

ఇటీవల నంద్యాలలో జరిగిన ఐదో రాష్ట్రస్థాయి జంపింగ్ రోప్ పోటీల్లో స్థానిక పాత బాలాజీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ వెంకటరెడ్డి, పిటి హనీఫ్ తెలిపారు. ఎంపికైన ఎం.సుధీర్‌రెడ్డి, సి.బద్రీనాథ్, డి.జీవన్, ఎ.సుధీర్, ఈ.వంశీ, ఎం.సుధీర్‌రెడ్డిలను డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, స్వర్ణలత, ఉపాధ్యాయ బృందం అభినందించారు. అలాగే పుట్టపర్తి నియోజకవర్గంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అదే పోటీల్లో ప్రతిభ చాటారని హెచ్ ఎం సతీష్ తెలిపారు. రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ జంపింగ్ రోప్ పోటీల్లో పదో తరగతి విద్యార్థులు ఎం.జయంతి నాయక్, బి.వివేక్‌నాయక్(8వ తరగతి) గోల్డ్ మెడల్ సాధించారన్నారు. వీరు ఆగస్టులో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా సెక్రటరీ ఎస్.నరసింహులు నాయక్ తెలిపారు. విద్యార్థులను పిడి ఎన్.ధరణి, హెచ్‌ఎం సతీష్, హెచ్‌డబ్ల్యుఒ సత్య నారాయణ అభినందిచారు.

ప్రశంసా పత్రాలతో బాలాజీ విద్యార్థులు

ప్రశంసా పత్రాలతో ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

గుండుమల కెజిబివి తనిఖీ

మడకశిర రూరల్ : మండలంలోని గుండుమల గ్రామంలో ఉన్న కెజిబివిని మంగళవారం డిఇఒ మీనాక్షి సందర్శించి రికార్డులను పరిశీలించారు. నాణ్యమైన భోజనం ఇస్తున్నారని లేదా అని విద్యార్థినులను అడిగి తెలుసు కున్నారు. విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. వసతి గృహం పరిసరాలు, వంటగదిని పరిశీలిం చారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. ఎస్ఒ సమాచారం ఇవ్వకుండా సెలవుపై వెళ్లడంతో డిఇఒ ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్రీవారి హుండీ లెక్కింపు

కదిరి అర్బన్ : పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తుల హుండీల ద్వారా సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. 66 రోజులకు గానూ రూ. 90,73,407 ఉన్నట్లు ఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అలాగే బంగారు 23.855 గ్రాములు, వెండి 310 గ్రాములు, విదేశీ కరెన్సీ ఉన్నట్లు తెలిపారు. పర్యవేక్షణ అధికారిగా రమేష్ బాబు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, ఎస్‌బిఐ కదిరి మేనేజర్ హరిప్రసాద్, బ్యాంకు సిబ్బంది, వివిధ సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

హిందూపురం : హిందూపురం పురపాలక సంఘ అత్యవసర సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ అభివృద్ధి పనులకు సంబందించిన 36 అంశాలతో కూడిన అజెండాపై చర్చించడం జరుగుతుందన్నారు.కౌన్సిల్ సభ్యులు ఉదయం 11 గంటలకు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

తాగునీటి సమస్య రానివ్వం : మంత్రి సత్యకుమార్

ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ధర్మవరం నియోజకవర్గంలో ఎక్కడా నీటి సమస్య లేకుండా చేయడమే తమ లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మండలంలోని సంకేపల్లి క్రాస్‌లో ఉన్న నర్సరీ సమీపంలో ఏర్పాటు చేసిన తాగునీటి సంపును మంగళవారం మంత్రి ప్రారంభించారు. మంఉదుగా మంత్రికి ఎంపిపి గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనస్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ రూ. 65.8 లక్షలు వెచ్చింఇ, నీటి సంపు, ప్రహరీ ఏర్పాటు చేశార న్నారు. దీని ద్వారా సంకేపల్లి, గుంజేపల్లి, ముదిగుబ్బ, గుడ్డంపల్లితండా, జొన్నల కొత్తపల్లి, తదితర 17 గ్రామాలకు తాగునీరు సరఫరా చేయవచ్చు అన్నారు. అనంతరం మంత్రి ముదిగుబ్బలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం కాకతీయ హోటల్ సమీపంలో మొక్కలు నాటారు. ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వైద్య సేవలపై రోగులతో మాట్లాడారు. వైద్యులను అడిగి ఆసుపత్రిలో సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు.

చుక్కల భూముల సమస్యలు పరిష్కరించాలని వినతి

మండల వ్యాప్తంగా చుక్కల భూముల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ప్రభుత్వా సుపత్రి వద్ద సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంత్రి సత్యకుమార్‌కు రైతులు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 15వేల ఎకరాలపైగా భూములు చుక్కల్లో పడ్డాయని వివరించారు. పాత పట్టా భూములకు శాపంగా మారిన 22-ఏ నిషేధిత జాబితా చట్టాన్ని సవరించి చుక్కల భూములు రిజిస్ట్రేషన్ అయ్యేలా చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని కోరారు. మీ సమస్యను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుం టామని మంత్రి హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో సిపిఐ నాయకులు తిప్పయ్య, తుమ్మల చిన్నప్ప, ఆదెప్ప, ప్రసాద్‌నాయక్, వెంగముణి, ఈశ్వర్‌నాయక్, రాధాకృష్ణ, మధు, రైతులు మోపురినాయుడు, రాగినాయుడు, ఇంటూరి నాయుడు, రామంజి, సింగరయ్య, వెంకటరమణ, సూరి, కిష్టప్ప ఉన్నారు.

నిరుపయోగంగా 'చెత్త' వాహనాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపాల్టీలో నూతన చెత్త వాహనాలు మూలకు చేరాయి. వాహనాలు కొని సంవత్సరం కూడ కాకనే మైనర్ రిపేరీలు చేయించేవారు లేక వాహనాలు మున్సిపల్ పరిధిలో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మున్సిపాల్టీలో దాదాపు 6నెలల క్రితం 20 లక్షల రూపాయలు వెచ్చించి 10 వాహనాలు కొనుగోలు చేశారు. కాని వాటికి సర్వీసింగ్ చేయించేందుకు మున్సిపాల్టీలో బిల్లులు పెట్టకపోవడంతో పారిశుధ్య కార్మికులు అవస్థలు పడుతున్నారు. ఈ వాహనాలు ఉంటే పారిశుధ్య కార్మికులకు సైతం పనిభారం తగ్గుతుంది. మున్సిపల్ చైర్మన్, కమిషనర్ నిర్లక్ష్యం వల్లే చెత్త తరలించే వాహనాలు నిరుపయోగంగా మారాయన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపించి వాహనాలకు మరమ్మతు చేయించకపోతే వాహనాలు తుప్పుపట్టడం ఖాయమని, ప్రజాధనం దుర్వినియోగం అవ్వడం తథ్యమని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాహనాలకు సర్వీసింగ్ చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న చెత్త తరలింపు వాహనాలు

ప్రజాశక్తి
www.prajasakti.com

ఘనంగా ఉజ్జయిని మహంకాళి జాతర

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలో వెలసిన ఉజ్జయిని మహంకాళి అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి షోడశోపచార పూజలు, జ్యోతుల ఊరేగింపు కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించారు. మంత్రి సవిత తలపై బోనాలు మోసుకెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు, పట్టణ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ ,నాయకులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, ప్రగతి పాఠశాలల కరస్పాండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బోనాలు మోసుకెళ్తున్న మంత్రి సవిత

సోమందేపల్లి : పెనుకొండ పట్టణంలోని తోటగేరి మహంకాళి అమ్మవారి జాతర మహోత్సవంలో హిందూపురం ఎంపి బికె.పార్థసారధి కుమారుడు సాయికళ్యాణ్, అల్లుడు శశిభూషణ్ పాల్గొని నిర్వహించారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. వారి వెంట టిడిపి నాయకులు అశ్వర్థనారాయణ, రవిశంకర్, పూలగిరి శ్రీనివాసులు, దోని లక్ష్మీనారాయణ, నాని, శంకర్, హరీష్, వెంకటేష్, బాలునాయక్, శీన, బెల్లం శివశంకర్, జిరాక్స్ శీన, ప్రసాద్, గోపాల్‌యాదవ్, శివ, బాలు, మురళి పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ ఆడుతున్న మంత్రి సత్యకుమార్

క్రీడలతో మానసికోల్లాసం : మంత్రి

ధర్మవరం టౌన్ : క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ క్రీడాకారులకు సూచించారు. మంత్రి మంగళవారం ఉదయం పట్టణంలోని బాల్ బ్యాడ్మింటన్ కోర్టుకు వెళ్లి క్రీడాకారులతో కలిసి కాసేపు బ్యాడ్మింటన్ ఆడారు. ఆయన మాట్లాడుతూ తాను మంత్రిగా బిజీ షెడ్యూల్‌లో ఉన్నప్పటికీ సమయం దొరికినప్పుడల్లా ఆటలు ఆడుతానని తెలిపారు. క్రీడలు ఆడటం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి ఒక్కరు క్రీడలకు సమయం కేటాయించి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని సూచించారు.

స్టూడెంట్ మార్చ్ నిర్వహిస్తున్న విద్యార్థులు, సంఘాల నాయకులు

ఐసా స్టూడెంట్స్ మార్చ్ విజయవంతం

పెనుకొండ : ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో నిర్వహించిన స్టూడెంట్ మార్చ్ విజయవంతమైందని రాష్ట్ర అధ్యక్షులు వేమన తెలిపారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎన్‌టిఎ రద్దు చేయాలని ఐసా ఇచ్చిన పిలుపుమేరకు స్టూడెంట్స్ మార్చ్ చేపట్టామన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్బంధంగా నూతన జాతీయ విద్యా విధానం తీసుకొచ్చిందని విమర్శించారు. ఉమ్మడి ప్రవేశ పరీక్షలు ప్రవేశపెట్టి దేశవ్యాప్తంగా అనేక పరీక్షల్లో అవకతవకలకు అవకాశం ఇచ్చారని ఆరోపించారు. అందుకు బాధ్యత వహించి తక్షణమే కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని, ఉమ్మడి ప్రవేశ పరీక్షల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రొద్దం శివకుమార్, డివిజన్ ప్రధాన కార్యదర్శి మహేష్, మండల అధ్యక్షులు అనిల్, డివిజన్ నాయకులు రాకేష్, ఆది, మంజునాథ్, పునీత్, నవీన్, శ్రీరామ్, సురేష్‌నాయక్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

'మఠం భూమితో వైసిపికి సంబంధం లేదు'

ప్రజాశక్తి-బత్తలపల్లి

బత్తలపల్లిలోని నిడిమామిడి మఠం భూమిని ఎవరికైనా ఇచ్చుకోండి, తమకు ఎలాంటి అభ్యంత రం లేదని మండల వైసిపి నాయకులు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం వైసిపి మండల కన్వీనర్ జయరామిరెడ్డి, నాయకులు రాంభూపాల్‌రెడ్డి, బయపురెడ్డి వెంకట్రాముడు, సూరి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బత్తలపల్లిలో సర్వే నెంబర్-401లో ఉన్న 19.86 ఎకరాల నిడిమామిడి మఠం భూమికి సంబంధించి సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆ భూములతో వైసిపికి కానీ, తనకు కానీ ఎలాంటి సంబంధం లేదనిమాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పలుమార్లు స్పష్టం చేశారన్నారు. అయినా చౌకబారు విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ఆ భూమిలో పేదలకు ఇంటి ఇవ్వాలని లేనిచో వైసిపి అధికారంలోకి వస్తే తామే నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇస్తామని తెలిపారు.

పశువులకు వ్యాక్సినేషన్

రొద్దం : పశువులకు జబ్బులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని మండలంలోని చోలేమర్రి పశువైద్యాధికారి మురళి సూచించారు. జబ్బులు రాకుండా పశువులకు ముందు జాగ్రత్తగా మండలంలోని రొద్దకంపల్లిలో ఎల్‌ఎస్‌డి వ్యాక్సిన్ వేశారు. రెండేళ్ల క్రితం ఇలాంటి జబ్బులు ప్రబల డంతో అనేక పశువులు మృత్యువాత పడ్డాయని, దీంతో ముందు జాగ్రత్తగా వ్యాక్సినేషన్ వేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఎమ్మార్పీఎస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ జాతీయ నాయకులు నరేంద్రబాబు పిలుపునిచ్చారు. స్థానిక జగ్జీవన్ రామ్‌నగర్‌లోని రాముని దేవాలయంలో మం గళవారం పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నరేంద్రబాబు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని కార్యకర్తలతో సమావేశం నిర్వహించామన్నారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి త్వరలోనే సుప్రీంకోర్టులో తీర్పు వెలువడనున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలో కమిటీలు వేసుకుని జెండాలు ఆవిష్కరించి యువతరానికి బాధ్యతలు అప్పజెప్పి చైతన్యం చేయాలన్నదే మందకృష్ణ ఉద్దేశమన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు బూదెప్ప, శివయ్య, బండారు కదిరప్ప, జిల్లా అధికార ప్రతినిధి నాగభూషణం, గజ్జల రామాంజనే యులు, నాగరాజు, సుధాకర్, రామకృష్ణ, నాగేపల్లి బాబు, రమేశ్, నాగేంద్ర, ఆదినారాయణ, పుల్లప్ప, ప్రకాశ్, లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు నరేంద్రబాబు

ఆందోళనలు చేస్తే తప్ప వేతనాలు ఇవ్వరా..?

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్‌లో విధులు నిర్వహించే కార్మికులకు ఆందోళనలు చేస్తే తప్ప వేతనాలను ఇవ్వని స్థితిలో ప్రభుత్వం ఉందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు విమర్శించారు. మంగళవారం పెనుకొండ వద్ద ఉన్నా గొల్లపల్లి పంప్ హౌస్ వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఓబులు మాట్లాడుతు కార్మికులకు వెంటనే 5 నెలల పెండింగ్ వేతనాలు, 29 నెలల పిఎఫ్ నిధులను ఖాతలోకి జమ చేయాలని డిమాండ్ చేశారు. శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్ ప్రాజెక్టులో వందలాది గ్రామాలకు కార్మికులు నీటిని సరఫరా చేస్తున్నారన్నారు. కార్మికులకు 5 నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వేతనాలు చెల్లించమంటే ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని అధికారులు చెబుతున్నారన్నారు.కార్మికుల ఆకలి కేకలను నివారించేందుకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. మడకశిర, హిందూపురం నియోజకవర్గాల్లోని గ్రామాలకు లైన్మెన్, ఆపరేటర్, హెల్పర్లు, గ్యాంగ్‌మెన్‌లు ఇలా 500 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరందరికి 5 నెలలుగా వేతనాలు, 29 నెలల ప్రావిడెంట్ ఫండ్ బకాయిలు, ఈఎస్‌ఐకి సంబంధించిన చెల్లింపులు అసలు జరగడం లేదన్నారు. వెంటనే బకాయి వేతనాలతో పాటు ఇతర అలవెన్సులను చెల్లింపులు చేపట్టక పోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం శ్రీరామిరెడ్డి కార్మిక సంఘం నాయకులు నాగేంద్ర, సోమశేఖర్, గిరీష్, మాధవ, బాలు, మురళి, మహానందితో పాటు అధికసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

రాజముద్రతో రైతులకు పాసు పుస్తకాలు : మంత్రి సవిత

ప్రజాశక్తి-పరిగి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజముద్రతో ఉన్న పట్టాదారు పుస్తకాలను ముద్రించి రైతులకు అందిస్తున్నామని బిసి, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. మంత్రి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతుల పట్టాదారు పాస్తు పుస్తకంపై వైఎస్. జగన్మోహన్‌రెడ్డి ఫొటోలు ముద్రించి ఆ భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలన్న ఆకాంక్షతో పని చేశారని విమర్శించారు. జగన్ పాలనలో అభివృద్ధి, పాలన రెండూ దారి తప్పాయన్నారు. ప్రజల కు సంక్షేమ పాలన అందించాలనే లక్ష్యంతో సిఎం చంద్రబాబు ఎన్నికల హామీలను అమలు చేసేలా ముందడుగు వేస్తున్నారన్నారు. అంతకుముందు మంత్రి మండలంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో దండు మారెమ్మ గ్రామోత్సవంలో పాల్గొన్నారు. శ్రీరంగరాజుపల్లిలో పర్యటిం చారు. అనంతరం కొడిగనహళ్లి ఎపిఆర్ఎస్ ఎక్సలెన్స్, జడ్‌పి హెచ్‌ఎస్ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. విద్యాభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని వాటిని సరైన పద్ధతిలో వినియోగించాలని, విద్యార్థులకు అందించే మౌలిక సదుపాయాల విషయంలో ఎక్కడా రాజీ పడొద్దు అన్నారు. మంత్రి వెంట టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు సూర్యనారాయణ, సత్యనారాయణ, మారుతిప్రసాద్, సోమప్ప, వెంకటేష్, ప్రవీణ్‌రెడ్డి, తిలక్ ఉన్నారు.

విద్యార్థుల హాస్టల్‌ను పరిశీలిస్తున్న మంత్రి సవిత

పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి-పెనుకొండ

మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన పంట పొలాలను మంగళవారం సౌతాఫ్రికా బృందం పరిశీలించింది. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఆఫ్ ది విట్వాటర్ స్రాండ్ దక్షిణ ఆఫ్రికాకు చెందిన ప్రొఫెసర్లు విశ్వాస్‌సత్గర్, మిచెల్ విలియమ్స్ బృందం రైతు బాలునాయక్, రంగారెడ్డి సాగు చేసిన పంటలను పరిశీలించారు. సాగు విధానం, దిగుబడులు, ఆదాయం, ఖర్చు, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విధానం ద్వారా అధిక దిగుబడులతో పాటు ఆదాయం పెరుగుతుందని రైతులు వివరించారు. అనంతరం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రకృతి వ్యవసాయ సాగు విధానాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఎ సాకప్ప, ఎంటి మల్లికార్జున, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : మండలంలోని కోట్లపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పంటల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో సౌత్ ఆఫ్రికా బృందం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన పంటలను పరిశీలించి రైతులు కేశవరెడ్డి, ఆంజనేయులును అడిగి వివరాలు తెలుసుకున్నారు. రైతులు ఘన జీవామృతం, విత్తన గుళికల తయారీ విధానాన్ని చేసి చూపించారు. వారి వెంట నేషనల్ ఫార్మింగ్ అసోసియేట్ సాకప్ప, మాస్టర్ ట్రైనర్ సుధాకర్, రవి నాయక్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సౌత్ ఆఫ్రికా బృందానికి ప్రకృతి వ్యవసాయం గురించి వివరిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్

నగర పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

ప్రజాశక్తి-మడకశిర

మడకశిరను ఆదర్శ నగర పంచాయతీగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణంలో నెలకొన్న తాగునీరు, డ్రెయినేజీ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని తీర్మానం చేశారు. సుందరీకరణలో భాగంగా పట్టణ చివరలో ఆర్చ్‌లు, పూలమొక్కలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ రంగస్వామి, కౌన్సిలర్లు రాజా, ఉమాశంకర్, శీనప్ప, ప్రభావతి, గంగమ్మ, వెంకటలక్ష్మమ్మ, సావిత్రమ్మ, మేఘన, రమేష్, సుధాకర్‌నాయక్, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో డైట్ పరీక్షలు

ప్రజాశక్తి-బుక్కపట్నం

2023-24 బ్యాచ్‌లో రెండో సెమిస్టర్‌లో ఫెయిలైన డైట్ రెగ్యులర్ విద్యార్థులకు సెప్టెంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తామని డైట్ కళాశాల ప్రిన్సిపల్ రవి సాగర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రుసుము రూ. 150 చెల్లించి ఆగస్టు 11వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని, లేనిచో అదనంగా రూ. 50 అపరాధ రుసుముతో ఆగస్టు 19వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్‌ని సంప్రదించాలని తెలిపారు.

ఇంటి నిర్మాణానికి సాయం పెంపు హర్షణీయం

టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పేదల ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ సాయం రూ. 4 లక్షలకు పెంచడం హర్షణీయమమని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పేదవాడి సొంతింటి కల కూటమి ప్రభుత్వంతో నెరవేరుతుందన్నారు. గత ప్రభుత్వం లబ్ధిదారునికి ఒక సెంటు రూ. 1.8 లక్షలు ఇవ్వడంతో చాలామంది పేదలు ఇంటి నిర్మాణానికి విముఖత చూపారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు 3 సెంట్ల స్థలం ఇస్తామని సిఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం పట్ల పేదలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. అలాగే టిడ్కో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

ప్రజాశక్తి-గాండ్లపెంట

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డిఎల్‌ఒపి ఆంజనేయ సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. డిఎల్‌ఒపి మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా పారిశుధ్యం చర్యలు చేపట్టాలన్నారు. నీటి ట్యాంకులు శుభ్రం చేయాలని, చెత్త చెదారం ఎత్తి బ్లీచింగ్ చేయాలన్నారు. ప్రజలకు జాగ్రత్తలను వివరించాలన్నారు. అలాగే వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని సూచించారు. 1వ తేదీ పింఛన్ల పంపిణీ కార్యక్రమం 90 శాతం విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఈఓఆర్‌డీ సునీత, పంచాయతీ కార్యదర్శులు శంకర్, బాషా, రవికుమార్, ఓబుళమ్మ, భవానీ, సచివాలయ సిబ్బంది, ఇంజినీర్, అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీల పింఛన్లు అడ్డుకోవడం అన్యాయం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఎస్సీ, ఎస్టీలకు పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకోవడం అన్యాయమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి అధ్యక్షులు సాకే హరి తెలిపారు. పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అర్హులైన ఎస్సీ ఎస్టీలకు పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని మడకశిర పర్యటనకు వస్తున్న సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో ఆల్ ఇండియా పార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షులు పాపిరెడ్డిపల్లి పృథ్వీ, విద్యార్థి, నిరుద్యోగ పోరాట ఐక్య వేదిక వినోద్‌కుమార్, జెఎసి నాయకులు చిరంజీవి, రామకృష్ణ, ఓబులేసు, వెంకటేశ్, మల్లేష్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు

మంత్రిని కలిసిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్

ధర్మవరం టౌన్ : వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను మంగళవారం పట్టణంలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల ప్రాంగణంలో సీసీ రోడ్లు, కంప్యూటర్స్ సౌకర్యం కల్పించాలని ప్రిన్సిపల్ కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలో అధ్యాపకులు చిట్టెమ్మ, షమీవుల్లా, భువనేశ్వరి, పుష్పవతి, తాహీర్, సరస్వతి, ఆనంద్, మీనా, గంగ ఉన్నారు.

1న ఉచిత క్యాన్సర్‌స్క్రీనింగ్ క్యాంప్

పుట్టపర్తి అర్బన్ : ఎంఎస్ రామయ్య మెడికల్ కాలేజీ, ఆసుపత్రి క్యాన్సర్ విభాగం సహకారంతో ఆగస్టు 1వ తేదీ పట్టణంలోని సాయినగర్‌లో ఉన్న సత్యసాయి అనుగ్రహ వృద్ధాశ్రమం వెనుక ఉన్న కేంద్రంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తామని సత్యసాయి పాలియేటివ్ కేర్ సెంటర్ నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 35 ఏళ్లు పైబడిన మహిళలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పరీక్షలు చేస్తారని, పాల్గొనే వారు 93911 90375కు ఫోన్ చేయాలని తెలిపారు.

కోటగడ్డ పెద్దమ్మకు బోనాలు

ధర్మవరం టౌన్ : ఆషాడ మాసం సందర్భంగా కొటగడ్డ పెదమ్మ దేవికి మంగళవారం మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. పట్టణంలోని యాదవ వీధికి చెందిన మహిళలు బోనాలు నెత్తిన ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో వెలసిన పెద్దమ్మకు బోనాలు సమర్పించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయం ఎదుట నిమ్మకాయలతో దీపాలు వెలిగించి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పెనుకొండ నారాయణమ్మ, రామ్‌ప్రసాద్, కృష్ణవేణి, ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మణ్, చంద్ర, ప్రసాద్, లావణ్య, మల్లిక పాల్గొన్నారు.

తాగునీటి కలుషితంపై ప్రజల నిరసన

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీలోని 6వ వార్డు సమాధి రోడ్డు వీధిలో తాగునీటిలో మురుగునీరు కలుస్తున్నాయని మంగళవారం ఆ వార్డు ప్రజలు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ తాగునీటి పైపులైను లీకేజీ కావడంతో మురుగునీరు కలిసి రోగాల బారిన పడుతున్నామన్నారు. దీంతో కూటమి నాయకులు ఆ వార్డులో పర్యటించి మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు విషయాన్ని తెలిపారు. ఆయన అక్కడికి వెళ్లి పరిశీలించి సమస్యను పరిష్కరించాలని తాగునీటి సరఫరా కార్మికులను ఆదేశించారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు, దాత రమేష్

విద్యాసామగ్రి పంపిణీ

పుట్టపర్తి రూరల్ : మండలంలోని అటవీ ప్రాంతంలో ఉన్న అమకొండపాలెం గ్రామంలో దాతల సహకారంతో ఖిద్మత్ ఏ ఖల్క్ ట్రస్టు నిర్వాహకులు విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. దాత రమేష్ కూతురు చందన పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ట్రస్టు నిర్వాహకులు షామీర్ పాఠశాలలో 40 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, ఎరేజర్, బిస్కెట్స్, తదితర సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు వెంకటేష్, విష్ణు, అలీ, భరత్, జావిద్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన తలారి భైరవుడు కుమారుడు సాంబశివ(28) మంగళ వారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. చెన్నేకొత్తపల్లి మండలంలోని వెంకటంపల్లి గ్రామానికి చెందిన రైతు శ్రీకాంత్‌రెడ్డి తన పొలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో మరమ్మతుల కోసం విద్యుత్ హెల్పర్ సాంబశివను అక్కడికి పిలుచుకొని వెళ్లారు. సాంబశివ మరమ్మతులు చేస్తుండ గా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ఉంది. ఇదిలా ఉండగా విద్యుత్ సమస్యలపై రైతులు ఫిర్యాదు చేసినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో పంటలు ఎండిపోతా యనే ఉద్దేశంతో రైతులు ప్రయివేటు హెల్పర్లతో పనులు చేయించుకుంటున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇకనైనా ఉన్నతాధికారులు స్పందిం చి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సాంబశివ

ఆటో బోల్తా.. ఆశా వర్కర్‌కు గాయాలు

హిందూపురం : హిందూపురం-గోరంట్ల రహదారిలోని నందమూరి నగర్ వద్ద మంగళవారం ఆటో బొల్తా పడిన ప్రమాదంలో ఆందులో ప్రయాణిస్తున్న ఆశ వర్కర్ మంజుళ తీవ్ర గాయాలు అయ్యాయి. గోరంట్ల నుంచి హిందూపురం పట్టణానికి ఆశ వర్కర్ మంజుళతో పాటు ఆమె అన్న ఆంజినేయులు, తమ్ముడు సంతోష్ ఓ ఆటోలో వస్తున్నారు. వీరు వస్తున్న ఆటో నందమూరి నగర్ వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆశ వర్కర్ మంజుళకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో హిందూపురం ప్రభుత్వ అసుపత్రికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న సిఐటియు నాయకులు రాము, తోటి ఆశ వర్కర్లు అసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ యూనియన్ నాయకులు రాధ, మమత, వరలక్ష్మి, శిల్ప, రాజమ్మ, బీబిజాన్, భారతి, యశోద, కెబిఎల్. అనిత, జయలక్ష్మి, సునీత, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ.. అనుమానితుల అరెస్టు

నంబులపూలకుంట : మండలంలోని మండెంవారిపల్లి క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మండెంవారిపల్లి నుంచి స్కార్పియో, బైకుల్లో వస్తున్న వారు పోలీసులను గమనించి పారిపోయారు. దీంతో వారిని వెంబడించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని, మిగిలిన వారు పరారయ్యారని ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. పట్టుబడిన వారిని విచారించగా గత సోమవారం తెల్లవారుజామున కొట్టంవారిపల్లి గ్రామం లో రోడ్డు పక్కన ఇంటి వద్ద బైక్‌ను దొంగలిస్తుండగా ఇంటి యజమాని బయటికి రావడంతో ఈ ఐదుగురు రాడ్లతో భయపెట్టారు. యజమాని కేక లేయడంతో ఇరుగు పొరుగు వారు రావడంతో పారరయ్యారు. వారి నుంచి స్కార్పియో, 4 బైకులు ఇనుప రాడ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పరారైన ఇద్దరిని కూడా త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

స్కార్పియో వాహనం అపహరణ

పెనుకొండ : పట్టణంలోని బ్రిలియన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సమీపంలో ఓ ఇంటి ముందు నిలిపిన స్కార్పియో కారును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని ఎస్ఐ రాజేష్ తెలిపారు. పట్టణానికి చెందిన నరేష్ ఏపీ 02 సీసీ 7499 నెంబర్ గల స్కార్పియో కారును కోనాపురం రోడ్డులో ఉన్న తన ఇంటి ముందు నిలిపి ఉంచాడు. మంగళవారం తెల్లవారుజామున 3 నుంచి 4 గంటల మధ్య గుర్తుతెలియని వ్యక్తులు వాహనంలో వచ్చి స్కార్పియోను దొంగలించి తీసుకెళ్లినట్లు సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా తెలిసిందని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాండ్లపెంటలో మూడు ప్రాంతాల్లో చోరీలు

గాండ్లపెంట : గాండ్లపెంటలో సోమవారం రాత్రి మూడు ప్రాంతాల్లో చోరీ జరిగినట్లు ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు. గాండ్లపెంట సమీపంలో ఉన్న గుజిరి షెడ్ వెనుక భాగంలో స్క్రూలు పగలగొట్టి చోరీ పాల్పడ్డారు. గుజిరి షెడ్‌లో 5 మోటార్లు, రాగి వైరు 33 కిలోలు, సిల్వర్ వైరు 22 కిలోలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు మహమ్మద్ రఫీ వాపోయడారు. అలాగే జీనులకుంట వెళ్లే వీధిలో ఆర్ఎంపి క్లినిక్ తాళాలు పగలగొట్టి రెండు సిలిండర్లు ఎత్తుకెళ్లారు. క్లినిక్ పక్కన బేబీజాన్ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తాళాలు పగలగొట్టేందుకు ప్రయత్నం చేసి విఫలమయ్యారు. చోరీల గురించి తెలిసిన వెంటనే ఎస్ఐ చోరీ జరిగిన ప్రాంతాలకెళ్లి పరిశీలించారు.

చోరీ జరిగిన షెడ్డును పరిశీలిస్తున్న పోలీసులు

ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్

కొనసాగిన ఆక్రమణల తొలగింపు

కదిరి టౌన్ : పట్టణంలోని కోర్టు రోడ్డు, క్లాక్ టవర్ కూడలిలో రోడ్డుకు ఇరువైపులా కాలువలపై ఏర్పాటు చేసుకున్న దుకాణాలు, ఆక్రమణల తొలగింపు చర్యలు రెండో రోజూ కొనసాగించారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న షెడ్లు, పెట్టె బంకులతో వాహనాల రాకపోకలు సాగించేందుకు ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రజలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆక్రమణలు తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పోలీస్ అధికారుల సహకారంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న షెడ్లను తొలగించారు.

మొక్కజొన్న, కంది పంటల పరిశీలన

బత్తలపల్లి : తాడిమర్రి మండలంలోని నార్సింపల్లి రైతు సేవా కేంద్రం పరిధిలోని నిడిగల్లు గ్రామంలో రైతు ఎం.హేమంత్ సాగు చేసిన మొక్కజొన్న పంటను మంగళవారం డిఆర్‌సి, ఎడిఎలు విద్యావతి, సనా వుల్లా, ధర్మవరం ఎడిఎ కృష్ణయ్య పరిశీలించారు. మొక్కజొన్న పంటను జంట సాలు పద్ధతి, డ్రిప్ ద్వారా నీటి పారుదల విధానంలో సాగు చేశారు. ఈ పంటను బోదె పద్ధతిలో సాగు చేస్తే మొక్కల సాంద్రత పెంచడమే కాక నీటి వసతి, ఎరువుల వాడకం సులభమవుతుందని రైతుకు వివరించారు. అలాగే తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు. అనంతరం మహిళా రైతు చంద్రకళ సాగు చేసిన కంది పంటను పరిశీలించి మొక్కకు, మొక్కకు మధ్య అడుగు దూరం పాటించాలని, తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు. వారి వెంట డిఆర్‌సి అబ్దుల్‌అలీ, వ్యవసాయ శాఖ అధికారి రమాదేవి, నిడిగల్లు సర్పంచి నాగభూషణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఉన్నారు.

కంది పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు